క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ

అయిజ: మండల కేంద్రంలోని దుర్గానగర్ కాలనీలో సోమవారం రాత్రి కాంగ్రెస్ కార్యకర్త వీరేష్ (40) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలకు రంగు శ్రీధర్ రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జయన్న, దేవరాజు, మద్దిలేటి, రాజ నారాయణ, వెంకటేష్, సత్యరాములు, మైబు, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుమార్తె వివాహానికి ఆర్థికసాయం



మానవపాడు: మండలంలోని అమరవాయిలో మిత్రుడి కుమార్తె వివాహానికి ఆర్థిక సాయం చేసి మంచి మనసు చాటుకున్నారు 1990– 91 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు. గ్రామానికి చెందిన చిన్నకుర్మన్న కుమార్తె ప్రియాంక పెళ్లి ఖర్చుల నిమిత్తం స్నేహితులు అందరూ కలిసి రూ.25వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కుర్మన్న స్నేహితులు పరమేష్, చంద్రన్న, ఆదీశ్వర్‌రెడ్డి, చోటా, శివ రెడ్డి, కదీర్, అయ్యన్న కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టీబీ అనుమానితులకు పరీక్షలు నిర్వహించాలి



మానవపాడు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ హేమ మానస ఆధ్వర్యంలో ఆశా డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. టీబీ అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో హెలెన్, అక్కమ్మ, చంద్రన్న, అనూష, సంధ్య వీణసాయి ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2007– 09 బ్యాచ్ ఇంటర్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి అధ్యాపకులను సన్మానించారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ప్రస్తుత ప్రిన్సిపాల్స్ కృష్ణ, వీరన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

గర్భిణులకు అవగాహన కల్పించాలి



గట్టు: క్రమం తప్పకుండా గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకునే విధంగా ఆశా వర్కర్లు అవగాహన కల్పించాలని వైద్యాధికారి రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు చేయించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టీబీ లక్షణాలున్న వారిని గుర్తించి, ఆస్పత్రికి తీసుకొచ్చి, పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, వెంకటాద్రినాయుడు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వనమహోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

- నర్సరీల్లో పండ్ల, పూల మొక్కల పెంపకం
- మండలానికి 1.60 లక్షల మొక్కల లక్ష్యం



తక్కశీలలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ తిరుపతన్న



ఉండవెల్లిలోని గ్రీన్ షెడ్డులో ఆకర్షణీయంగా నర్సరీ

ఉండవెల్లి: వనమహోత్సవానికి గ్రామాల్లో అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లో ప్రత్యేక నర్సరీలను ఏర్పాటు చేసి వచ్చే వర్షాకాలం నాటికి మొక్కలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. రహదారులకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

16 నర్సరీలు ఏర్పాటు

మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో అధికారులు నర్సరీలు ఏర్పాటు చేశారు. వేసవి ప్రారంభంలోనే లక్ష్యాలను గుర్తించి నర్సరీల్లోలో బెడ్లు ఏర్పాటు చేశారు. మండలంలో 1.60 లక్షల మొక్కల పెంపకమే లక్ష్యంగా చర్యలు చేపట్టారు. విత్తనాలు నాటడం, నీరు పెట్టడం, బ్యాగ్ ఫిల్లింగ్‌తో పాటు ఎండ వేడిమి నుంచి మొక్కలు రక్షించేందుకు గ్రీన్‌షెడ్లు ఏర్పాటు చేశారు.

పండ్లు, పూల మొక్కల పెంపకం

మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో నర్సరీల్లో గ్రామ విస్తీర్ణం, జనాభా ఆధారంగా మొక్కల పెంపకం సామర్థ్యాలను నిర్ధారించారు. ఒక్కోక్క నర్సరీలో 10 వేల నుంచి 30 వేల వరకు మొక్కలు పెంచుతున్నారు. ఇళ్లల్లో నాటేందుకు పండ్లు, పూల మొక్కలు సిద్ధం చేస్తున్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్, ప్రకృతి వనాల కోసం మరిన్ని రకాల విత్తనాలు నాటారు.

షేడ్ నెట్‌తో సంరక్షణ..

వేసవిలో ఎండలు అధికమవుతున్న దృష్ట్యా నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేసి ఎండ నుంచి మొక్కలకు రక్షణ కల్పిస్తున్నారు. అదే విధంగా ఉపాధి హామీ కూలీలతో నిత్యం నీటిని అందిస్తున్నారు. నర్సరీల నిర్వహణ మొత్తం పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు.

రక్షణ చర్యలు

వనమహోత్సవం కార్యక్రమంలో నాటే ప్రతి మొక్కను కాపాడేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కంచె ఏర్పాటు చేసి మొక్కల రక్షణ చర్యలు చేపట్టారు.రోడ్లకు ఇరువైపులా రైతులు, గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిన, మంటల్లో కాలిన మొ క్కలు తొలగించి కొత్త మొక్కల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. ప్రతి గ్రామం పచ్చదనంతో వెల్లివిరియాలని ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

లక్ష్యం మేరకు పెంపకం..

గ్రామ పంచాయతీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు పెంచుతున్నాం. వడగాలులకు మొక్కలు ఎండిపోకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీ, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశాలు నిర్వహించి సూచనలు, సలహాలు అందిస్తున్నాం.

–తిరుపతన్న, ఎంపీడీఓ, ఉండవెల్లి

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



సుల్తానాపురంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దొడ్డెప్ప

అలంపూర్: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ బింగిదొడ్డి దొడ్డెప్ప అన్నారు. మండలంలోని సుల్తానాపురం గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం వైస్ చైర్మన్ పచ్చర్లకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దొడ్డెప్ప మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం గ్రామాల్లోనే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఏ గ్రేడ్ వరి రకానికి క్వింటాల్‌కు రూ.2320, సాధారణ వరి ధాన్యానికి రూ.2300 మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. సన్నాలకు ప్రభుత్వం అదనంగా రూ.500 బోనస్ అందజేస్తుందన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. నాణ్యమై వరి ధాన్య ఉత్పత్తికి సుల్తానాపురం ప్రసిద్ధిగాంచిందని కొనియాడారు. కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అడ్డాకుల రాము, నర్సన్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, శంకర్‌గౌడ్, లాల్ నాయుడు, రామాంజనేయులు, నరసింహ్మ, వెంకటేష్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ సుస్థిర వ్యవసాయం చేద్దాం



రైతులకు అవగాహన కల్పిస్తున్న సీఎస్‌ఏ ప్రతినిధులు

అయిజ: పర్యావరణాన్ని, మనుషుల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు సూక్ష్మ సుస్థిర వ్యవసాయం చేద్దామని సీఎస్‌ఏ (సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్) సంస్థ ప్రతినిధి యాదవరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో సీఎస్‌ఏ సంస్థ ప్రతినిధులు సుస్థిర వ్యవసాయం, సేంద్రీయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూక్ష్మ సుస్థిర వ్యవసాయం గురించి తెలియజేశారు. సేంద్రీయ ఎరువులతో చేపట్టే వ్యవసాయంపై సూచనలు చేశారు. ఈసందర్భంగా సీఎస్‌యే ప్రతినిధి యాదవరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయంలో వినియోగిస్తున్న రసాయన ఎరువులు, పురుగు మందులు మోతాదు ఎక్కువ కావడంతో పర్యావరణం దెబ్బతింటుదన్నారు. మార్కెటింగ్‌లో జరిగే మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎస్‌ఏ సంస్థ ప్రతినిధులు రాంబాబు, మురుగేశన్, ఉపేంద్ర, రమేష్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



జమిచెడ్‌లో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గద్వాల క్రైం: ప్రజలు, వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఏఆర్ ఎస్‌ఐ బాలచంద్రుడు అన్నారు. మంగళవారం జమిచెడ్ సమీపంలో రోడ్డు నిబంధనలపై అవగహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్, ట్రిబుల్ రైడింగ్, మైనర్లు వాహనం నడపరాదన్నారు. నిబంధనాలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మద్యం తాగి వాహనం నడపరాదని ఎస్‌ఐ శ్రీహరి అన్నారు. వాహన తనిఖీల్లో భాగంగా మండల కేంద్రంలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిజమైన అర్హుల ఎంపిక



మానవపాడు: మండలంలోని ఎ. బుద్దిపాడు గ్రామంలో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల దరఖాస్తులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నమూనా ఇంటిని పరిశీలించే విధంగా అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త అని పీయూ వైస్‌ఛాన్స్‌లర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలో బీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వర జయంతి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 12వ శతాబ్దంలో బసవేశ్వరుడు కవిగా, విప్లవకారుడిగా లింగాయత్ మత వ్యవస్థాపకుడిగా సమాజంలో మార్పుకోసం కృషి చేశారని, కుల రహిత సమాజం , అసమానతలు లేని వ్యవ్యస్థ కోసం ఆయన పాటు పడడం గొప్ప విషయమన్నారు. ముఖ్య వక్తగా హాజరైన బాదిమి శివకుమార్ మాట్లాడుతూ నేడు భారత రాజ్యాంగ అవలంభిస్తున్న రాజ్యాంగాన్ని బసవేశ్వరుడు 12వ శతాబ్దంలోనే అవలంబించి, మార్గదర్శిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జేపీ ఎన్‌సీ కళాశాల ప్రిన్సిపాల్ బీసీ సెల్ డైరెక్టర్ ప్రవీణ, ఎస్సీ, ఎస్టీ, సెల్ డైరెక్టర్ నాగం కుమారస్వామి, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ధరూరు: మండల పరిధిలోని రేవులపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. మంగళవారం రేవులపల్లిలో 6, 7, 8 తరగతుల విద్యార్థుల కోసం నలుగురు వలంటీర్లను నియమించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సమ్మర్ క్యాంపులు ఉపయోగపడతాయన్నారు. చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్, గణితం, యోగా వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో మెరుగైన వైద్యం



అలంపూర్: సీఎంఆర్ఎఫ్‌తో మెరుగైన వైద్యం అందుతుందని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో రాజోళి మండలం పెద్దతాండ్రపాడుకు చెందిన కృష్ణవేణికి వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ.4 లక్షల ఎల్‌ఓసీని మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అదే విధంగా కర్నూల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అయిజ మండలం టీడీదొడ్డి గ్రామానికి చెందిన తిమ్మప్పను ఎమ్మెల్యే పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీల ఎంపిక పూర్తి చేయాలి

గద్వాల: జిల్లా వ్యాప్తంగా పార్టీ మండల కమిటీల ఎంపికలు త్వరితగతిన పూర్తి చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు అంజన్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీకే బంగ్లాలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలాల కమిటీలను ఈనెల 15వ తేదీ వరకు పూర్తి చేయాలన్నారు. కమిటీలలో మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. అదే విధంగా స్వయం శక్తిగల మహిళలు ఎక్కువగా లీడర్‌షిప్ పెంపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 592 పోలింగ్ కేంద్రాల్లో కమిటీల ఎంపిక పూర్తి చేయాలన్నారు. అదే విధంగా సంస్థాగత ఎన్నికల్లో మండల అధ్యక్షుల పాత్రకీలకమన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, రాంచంద్రారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, బండల వెంకట్రాములు, అక్కల రమసాయిబాబ, జయలక్ష్మి, రవికుమార్, శివారెడ్డి, రాజగోపాల్, దేవాదాసు, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉండవెల్లి: మండలంలోని తక్కశీల, కంచుపాడు బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి

అమరచింత: పంట మార్పిడితో రైతులు అధికంగా దిగుబడి పొందే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి అరవింద్ అన్నారు. మండలంలోని చంద్రగఢ్ గ్రామంలో మంగళవారం 'రైతు ముంగిట్లో వ్యవసాయ అధికారులు' కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ద్వారా దేశం మొత్తంలో ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు ఉన్నట్లే ప్రతి రైతుకు ఒక యూనిక్ ఐడీని కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. దీని కోసం రైతులు పాసు పుస్తకం, సెల్ నంబర్ తీసుకుని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు లేదా మీసేవా ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. పంటల సాగులో యూరియా వాడకం తగ్గించాలని, పామాయిల్ సాగుతో లాభాలు ఉన్నాయన్నారు. విత్తన శుద్ధి, వానాకాలంలో వేసే పంట రకాల ఎంపిక, విత్తన రశీదు, నకిలీ విత్తనాల విషయంలో మోసపోకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ హరిత, రైతులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోండి



జిల్లా పరిషత్ పాఠశాలలో వేసవి శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

మానవపాడు: వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, మధన్‌మోహన్ అన్నారు. మంగళవారం ఎంఈఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిక్షణ తరగతులను 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మల్లెందొడ్డిలో టీకాల కార్యక్రమంలో వెంకటేశ్వర్లు

మల్దకల్: పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా రైతులు, పశువుల యజమానులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం మండలంలోని మల్లెందొడ్డి, నాగర్‌దొడ్డి గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గొర్రెలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందులను ఏడాదికి మూడుసార్లు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ సహాయ అధికారి రమేష్, మండల పశువైద్యాధికారి వినయ్‌కుమార్, ఉషా, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



ఆరోగ్య కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న శివలీల

మానవపాడు: బాలల హక్కులు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ శివలీల అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, ఆశాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలల సమస్యల పరిష్కారం కోసం 1098 సర్వీసు 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ హేమమానస, ఎంఎల్‌పీ వీణ, సూపర్‌వైజర్ చంద్రన్న, చిట్టెమ్మ, డీసీపీయూ సూపర్‌వైజర్ నవీన్, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి సాహు మహారాజ్ సేవలు మరువలేనివి



సాహు మహారాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు, నాయకులు

వనపర్తిటౌన్: సామాన్య ప్రజలు, నిమ్న కులాల హక్కుల కోసం ఆర్థిక, వైద్య, విద్య వ్యవసాయం రంగాల అన్నింటిలోనూ విప్లవాత్మకమైన చట్టాలను తీసుకొచ్చిన ఛత్రపతి సాహు మహారాజ్ సేవలు మరువలేనివని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. ఛత్రపతి సాహు మహారాజ్ 103వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, గంధం నాగరాజు, శాంతన్న, కళాకారులు బాలేమియా, పానుగంటి యేసోపు, గాయకుడు చింతకుంట కురమయ్య, గంధం కృష్ణయ్య, కుశకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలి



ప్రిన్సిపల్ సెక్రటరీకి సమస్య విన్నవిస్తున్న వెంకటేశ్

జడ్చర్ల టౌన్: పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ ప్రిన్సిపల్ సెక్రటరీ దివ్యను మహబూబ్‌నగర్ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. జడ్చర్ల మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు సంబంధించి 2012–2014 సంవత్సరంలో పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు జీతాల నుంచి కట్ అయిన ప్పటికీ ఖాతాల్లో జమ కాలేదని, నష్టాలను ఆమెకు వివరించారు. దుర్వినియోగమైన డబ్బులను విషయంలో విచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలని ఆమెను కోరారు. ఇప్పటి వరకు 7మంది కమిషనర్లు, ఇద్దరు ఈఓలు మారినప్పటికి సమస్య పరిష్కారానికి నోచుకోలేదని, 40కి పైగా కార్మికులు మృతి చెందినా, వారికి ఎలాంటి ప్రయోజనం దక్కలేదని వివరించారు. స్పందించిన ప్రిన్సిపల్ సెక్రటరీ విచారణ చేసి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు జిల్లా అధ్యక్షుడు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో యూనియన్ జడ్చర్ల అధ్యక్షుడు మహేష్, రాష్ట్ర నాయకులు రాజమల్లు, పాలడుగు సుధాకర్, కార్యవర్గ సభ్యురాలు శివలీల ఉన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి



మాట్లాడుతున్న కుతుబ్

అమరచింత: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను వెంటనే ప్రారంభించి, విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరచింత మండలంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా పాలకులు మాత్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయట్లేదని వాపోయారు. కళాశాల నిర్మాణం కోసం పట్టణంలో ప్రభుత్వ స్థలం కేటాయించి మూడేళ్లు గడిచినా.. అడుగు ముందుకు పడట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్ చదివేందుకు ఆత్మకూర్, వనపర్తి, గద్వాల, పాలమూర్ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు దాపరించాయన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఈ విద్యాసంవత్సరంలోనే జూనియర్ కళాశాల ప్రారంభించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు.

ఖోఖో శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న కోన రాజశేఖర్

దేవరకద్ర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అండర్ –14 ఖోఖో పోటీలు మంగళవారం కోయిల్‌సాగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ పోటీలను జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోన రాజశేఖర్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో 10 క్యాంపులు ఏర్పాటు చేయగా అందులో కోయిల్‌సాగర్ ఒకటని తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల యువకులు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని, ఖోఖోలో రాణించి రాష్ట్ర స్థాయికి, జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో పీఈటీ కనకప్ప, మాజీ సర్పంచ్ వెంకటేశ్, గ్రామ నాయకులు చందుగౌడ్, మదన్, కథలయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించండి

ఆత్మకూర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని డీఆర్‌డీఓ ఉమాదేవి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పిన్నంచర్లలో మంగళవారం జరుగుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. పనులు జరిగే ప్రదేశంలో కూలీలకు టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు.